క్లుప్తంగా

చిన్నారుల భవిష్యత్‌కు పునాది 'అంగన్‌వాడీ'



గ్రాడ్యుయేషన్ దుస్తులు ధరించిన చిన్నారులతో అధికారులు, తల్లులు

పెద్దపప్పూరు: చిన్నారుల భవిష్యత్‌కు అంగన్‌వాడీ సెంటర్లు పునాదిలాంటివని ఐసీడీఎస్ సీడీపీఓ సాజితాబేగం అన్నారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా గురువారం మండలంలోని ముచ్చుకోట అంగన్‌వాడీ-1 సెంటర్లో ఐదేళ్లు నిండిన చిన్నారులు, తల్లులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యకు ఎంపికైన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. గ్రాడ్యుయేషన్ దుస్తులు ధరించిన పిల్లలను చూసి తల్లులు మురిసిపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పండ్ల తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భాగంగా ఐదు ఎకరాల్లోపు భూమి, నీటి సౌకర్యం ఉండి పండ్ల తోటలు, పూల మొక్కలు పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



ర్యాలీ చేస్తున్న దృశ్యం

పామిడి: పామిడిలో గురువారం యోగా ట్రైనర్ ఎస్.సంధ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు గుత్తి బీసీసీరోడ్డుపై యోగా ప్రయోజనాలతో కూడిన ప్లకార్డులు చేతబూని అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి యోగాతో ఆరోగ్యం–యోగాతో ఆనందం అన్న నినాదాలను హోరెత్తించారు. కార్యక్రమంలో అడ్వకేట్ దత్తు, పత్రా శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం-1ను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు కమిషనర్ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహం స్థితిగతుల గురించి నివేదిక తయారు చేసి రెండు రోజుల్లో కలెక్టర్‌కు పంపుతామని కమిషనర్ తెలిపారు.

మూసేసిన దారులన్నీ తెరిపించండి



అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ సర్కిల్ నుంచి పోర్టర్స్ లైన్ వరకూ ఉన్న రైల్వే క్వార్టర్స్ మీదుగా పాఠశాలలు, రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా రైల్వే అధికారులు నిర్మించిన ప్రహరీ తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మూసేసిన అడ్డదారులను తెరిపించాలని కోరుతూ గురువారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్యను సీపీఎం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. అడ్డదారులను మూసేయడం వల్ల విద్యార్థులు నిత్యం రద్దీగా ఉండే ఆర్అండ్‌బీ సర్కిల్ రోడ్డు మీదుగా పాఠశాలలకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి పాఠశాలల విద్యార్థులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూసేసిన దారులను తెరిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.శ్రీనివాసులు, దాసరి శీనా, మారుతి, నాగరాజు, జగ్గిలి రమేష్, రంగమ్మ, తిమ్మప్ప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలోనే సంతృప్తి

- ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా సేవలోనే సంతృప్తి లభిస్తుందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు సేవచేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు తహసీల్దార్లు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

గుంతకల్లు రూరల్: 'ప్రజా సేవలోనే సంతృప్తి ఉంటుంది. ప్రభుత్వ శాఖల్లో అత్యధిక ప్రాధాన్యత ఉన్న శాఖ రెవెన్యూ శాఖ. రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి' ని ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శేషఫణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీఓతోపాటు, రిటైర్డ్ తహసీల్దార్లు వెంకటాచలపతి, ఈఓ రాముడు, ఆదిలింగయ్య తదితరులు పాల్గొని రెవెన్యూ శాఖకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఏళ్ల చరిత్ర కలిగిన రెవెన్యూ శాఖ బిడ్డ ప్రతి అవసరాన్ని తీర్చే అమ్మలాంటిదన్నారు. మనిషి పుట్టుక నుంచి చావు వరకూ జీవితంలో అసరమయ్యే అన్నిరకాల పనులు, ఎదరయ్యే అన్ని రకాల సమస్యలను పరిష్కరించే ఏకైక శాఖ రెవిన్యూ శాఖ అని గుర్తు చేశారు. గ్రామీణులు వారి సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి, ఎవరి దగ్గరకు వెళ్లాలి అన్న అవగాహన లేక ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించేలా రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం రెవిన్యూ శాఖలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ తహసీల్దార్లను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ఉదయ్, ఆదినారాయణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలను అందించిన విశ్రాంత ఉద్యోగులను శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ భారతి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలు, రైతులు పొందుతున్న సేవలను వివరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ లలిత, ఆర్ఐ సందీప్, జూనియర్ అసిస్టెంట్ శంకర్, వీఆర్ఓలు పవిత్ర, కిశోర్, శివారెడ్డి, లింగమయ్య పాల్గొన్నారు.



గుంతకల్లులో రిటైర్డ్ తహసీల్దార్లను సత్కరిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నిజాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, మండల సర్వేయర్ గోవిందరాజులు, ఆర్ఐలు హనుమాన్, సీనియర్ అసిస్టెంట్లు వెంకటరామిరెడ్డి, ఉదయ్ , విఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జున స్వామి సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన స్థానిక గ్రామీణ బ్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజలు, రైతులు, విద్యార్థుల సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సీనియర్ వీఆర్ఏ ఓబులేసును సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్ణప్ప, ఏఎస్ఓ విజయ్ కుమార్, అధికారులు కీర్తి, లక్ష్మి, వీఆర్ఓలు అంకన్న, వెంకటనారాయణ, భాస్కర్, శ్రీనివాసులు, నరసింహులు, పెద్దన్న, నరేంద్ర, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవన్యూ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషా, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ మోహనవల్లి అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత వీఆర్‌ఓలు రుక్మాందర రెడ్డి, జనార్దనరెడ్డి , కార్యాలయ అటెండర్ ఫక్రుద్దీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ బాలమ్మ, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, వీఆర్ఓలు, వీఆర్ఏలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో గురువారం రెవిన్యూశాఖ దినోత్సవం తహసీల్దారు జయ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్వేత, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవ రావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మ ండల కేంద్రంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారామ్‌సింగ్, డీటీ వెంకటేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



శింగనమలలో మాట్లాడుతున్న తహసీల్దార్ మోహన్‌బాబు



పుట్లూరులో మొక్క నాటుతున్న తహసీల్దార్ మల్లికార్జునస్వామి, వీఆర్‌ఓలు



యాడికిలో విశ్రాంత రెవెన్యూ సిబ్బందిని సత్కరిస్తున్న తహసీల్దార్ మోహనవల్లి



యల్లనూరులో రైతులకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న తహసీల్దారు జయప్రసాద్



గుత్తిలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానించిన దృశ్యం



పామిడిలో రెవెన్యూ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరులో మాట్లాడుతున్న డీటీ మహబూబ్ బాషా



పెద్దవడుగూరులో రెవెన్యూ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పంట మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: రైతులు పంటమార్పిడి చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ స్వాతి సూచించారు. గురువారం స్థానికి మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు పంట మార్పిడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను ఏఓ వివరించారు. దిగుబడి బాగా వస్తుందనో లేక మార్కెట్లో ధర ఉందనో ఉద్దేశంతో రైతులు వరుసగా ఒకే పంట సాగు చేస్తున్నారన్నారు. అలా చేయడం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి ఘననీయంగా తగ్గిపోవడమే కాకుండా చీడపీడల బెడద పెరిగిపోతుందన్నారు. పంట మార్పిడి చేపట్టడం వల్ల చీడ పీడలను నివారించవచ్చని, క్రిమి సంహారక మందులు, ఎరువుల వినియోగం తగ్గుతుందని, పంటలో నాణ్యత పెరిగి దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. భూమిలో నీటి నిల్వ పెరిగి భూసారం పెరుగుతుందని, కలుపు మొక్కలు, కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా భూమిని కాపాడుకోవచ్చన్నారు. జొన్న పంట సాగు చేసిన పొలంలో రెండో ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ మిరప సాగు చేయకూడదన్నారు. వేరుశనగ పంట తర్వాత తిరిగి అదేపంటను సాగు చేయకూడదన్నారు. వేరుశెనగ తరువాత ఆముదం, జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో పంటమార్పిడి చేసుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. అదేవిధంగా వరి, జొన్న, మొక్కజొన్న పంటల తరువాత వేరుశనగ, కంది, అలసంద, పెసర సాగు చేయాలని ఆమె సూచించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి (ఇన్‌సెట్‌లో) నిర్మలారెడ్డి (ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు, న్యాయవాది నిర్మలారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ క్రమంలో మృత్యువాత పడింది. సమాచారం తెలుసుకున్న గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, సచివాలయ కన్వీనర్ రంగస్వామి, నాయకులు ఖురేషి కటిక అన్వర్, రామసుబ్బారెడ్డి, చికెన్ వెంకటేష్, రామసుబ్బయ్య, శేషు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

యాడికి: దళిత వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో మండలంలోని నిట్టూరు గ్రామ సర్పంచు ఈశ్వరమ్మ భర్త, టీడీపీ నాయకుడు రాజారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నిట్టూరు గ్రామంలో రాజారెడ్డి, దళిత కులానికి చెందిన చిన్న ఆంజనేయుల కుటుంబాలకు కొంత కాలంగా భూ సమస్య ఉంది. గురువారం రాజారెడ్డి దళితుల భూమిని దున్నుతుండగా చిన్న ఆంజనేయులు అడ్డుకున్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన రాజారెడ్డి చిన్న ఆంజనేయులును కొట్టడంతో గాయాలయ్యాయి. దీంతో బాధిత దళిత కుటుంబ సభ్యులు చిన్న ఆంజనేయులను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, మహిళలు

తాడిపత్రిటౌన్: ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలివ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చల్లవారిపల్లి సమీపంలోని సర్వేనెంబర్ 123లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించాలని చూస్తున్నారన్నారు. ఆ స్థలంలో గత ఏడు నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన ఇళ్లు లేని నిరుపేదలు దాదాపు 200 మంది గుడిసెలు వేసుకున్నామన్నారు. కబ్జాదారులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆ భూమిలో గుడిసెలను తగలబెట్టి, బండల రూలను పడగొట్టి భూమిని కంచె ఏర్పాటు చేశారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని ఆ భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి ఇన్‌చార్జ్ కొంటి గురప్ప, పట్టణ అధ్యక్షుడు జూటూరు రామక్రిష్ణ, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, యశోద, ఓబులమ్మ, కుమారి, పెద్దక్క, దేవి, శేషు, లక్ష్మీదేవి, సరస్వతి, రత్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండ




మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను స్వాగతిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పామిడి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పును శిరసావహిస్తూ నిరాశ వీడి భవిష్యత్‌లో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి సూచించారు. గురువారం ఆయన స్థానిక అనిమిరెడ్డి ఫ్యాక్టరీలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఓటమి అన్నది విజయానికి మెట్టు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ఎళ్లవేళలా పనిచేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సమస్యల పరిష్కారం కోసం పార్టీ అహర్నిశలూ కృషి చేస్తుందన్నారు. ఇందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైవీఆర్‌ను వారు పూలమాలతో సాదరంగా స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవ రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, అనిమిరెడ్డి, గౌస్, చాకలి సుంకన్న, ఫక్రు, శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు చేశారు.

ప్రత్యామ్నాయ మార్గం చూపండి



ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

ఉరవకొండ: పట్టణంలో తాగునీటి ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించొద్దని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా ఉరవకొండలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యుల దృష్టికి రైతులు, ప్రజలు తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హెసాన్‌బాషా, డీఈ అంజుమన్ నస్రీన్, జేఈ ఫామీదాబేగంతో కేంద్ర బృందం సభ్యులు చర్చించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఉరవకొండలో తాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు రితేష్‌చౌహాన్, డాక్టర్ పొన్నుస్వామి, వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్‌దూబే తదితరులు పాల్గొన్నారు.

'రాజీ' కేసుల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఏడీజే శ్రీహరి

గుత్తి: రాజీకి అవకాశమున్న అన్ని కేసులను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులకు ఏడీజే శ్రీహరి సూచించారు. గుత్తిలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారితో కలసి ఏడీజే మాట్లాడారు. ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు రాజీకి అవకాశ ముండే కేసులన్నింటినీ పరిష్కారం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పీడీ రత్నం, ప్రధాన కార్యదర్శి నగదాని చంద్రశేఖర్, కార్యదర్శి నవీన్, ఏజీపీ తిమ్మారెడ్డి, ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు మనోహర్‌బాబు, రాంగోపాల్, ఇస్మాయిల్, శ్రీనివాసులు, రసూల్, చంద్రకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఆర్‌కె దత్తు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



బుక్కరాయసముద్రంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



యాడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

బుక్కరాయసముద్రం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మండల డాక్టర్ తెహరున్నీసా సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరి శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీరు నిల్వ ఉంటే దోమలు ప్రబలి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్ రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, ఈశ్వరమ్మ, ఆది నారాయణమ్మ, ఆనంద్, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

యాడికి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని మోడల్ స్కూల్, కేజీబీవీలో గురువారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా హాస్టళ్ల ఆవరణలో మెలాథిన్ స్ప్రే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు, గుంతలు, పాత టైర్లల్లో, కుండల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడా లన్నారు. అలాగే రాత్రిపూట దోమ తెరలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాళ్లు మారుతి, నిర్మల, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.